# విజయములోని అపాయం

## చదువుటకు నియమించినవి #15

V. రెండవ పస్కానుండి మూడవ దాని వరకు (కొనసాగింది).

V. గలిలయలో క్రీస్తు మూడవ ప్రయాణం (పన్నిద్దరికి హెచ్చరికలు) (మత్తయి 9:35-38; 10:1-42;[1] 11:1; మార్కు 6:6-13; లూకా 9:1-6).

W. యేసునందు హేరోదు అభిలాష (బాప్తిస్మమిచ్చు యోహాను మరణగాథ) (మత్తయి 14:1-12ఎ; మార్కు 6:14-29; లూకా 9:7-9).

X. హేరోదు ప్రాంతమునుండి యేసు తొలిగిపోవుట (తిరిగి వచ్చుట).

1. పన్నిద్దరు తిరిగి వచ్చుట, గలిలయ తూర్పు తీరానికి నిష్క్రమించుట (మత్తయి 14:12బి,13; మార్కు 6:30-32; లూకా 9:10; యోహాను 6:1).

### పరిచయం

గొప్ప గలిలయ పరిచర్య ముగింపుకు సమీపించాం. ఈ పాఠంలో, యేసును, ఆయన శిష్యులును చివరిగా గలిలయ ప్రయాణం చేస్తున్నట్టు చూస్తాం.[2] ప్రయాణం విజయవంతంగా సాగింది. కాని విజయం అపాయాన్ని తెచ్చింది – ఎందుకంటే ఆ ప్రాంతాన్ని ఏలే[3] ప్రజలను బాధించే హేరోదు దృష్టికి క్రీస్తు వచ్చాడు. ఇటీవలే హేరోదు బాప్తిస్మమిచ్చు యోహాను తలను కొట్టించాడు. దానితో వాతావరణం తీవ్ర రూపం దాల్చింది. ఆ ప్రాంతమంతటిలో యేసు శిష్యులు ప్రయాణంచేసి తిరిగి వచ్చిన తరువాత, ఆ రాజున్న ప్రాంతాన్ని విడిచి – గలిలయ సముద్రపు తూర్పుతీరానికి చేరుకున్నారు. అక్కడ ప్రభువు 5000 మందికి ఆహారం పెట్టారు.[4] ఇది అతనికున్న ప్రజాభిమానం ఎంతగొప్పదో తెలుపుతుంది.

5000 మందికి ఆహారం పెట్టడం, దాని వెంట జరిగిన సంఘటనలను గూర్చి తరువాత పాఠంలో చదువుదాం. ఈ పాఠంలోనైతే, మూడవ గలిలయ ప్రయాణంలోని విజయం, క్రీస్తుకును, ఆయన శిష్యులకును అది తెచ్చిన అపాయం అనేవాటిమీద దృష్టి నిలుపుదాం.

### విజయవంతమైన ప్రయాణం (మత్తయి 9:35-38; 10:1-42; 11:1; మార్కు 6:6-13; లూకా 9:1-6)

**పనియొక్క పరిమాణం (మత్తయి 9:35-38; మార్కు 6:6)**

తన కాలము సమీపించిందని ఆయన ఎరిగి, తన్ను వెంబడించునట్లు ప్రతివ్యక్తికి అవకాశం కల్పించగోరి మరోసారి ఆయన గలిలయలో సంచరించబూనాడు. "ఆయన

చుట్టుపట్లనున్న గ్రామములు తిరుగుచు బోధించుచుండెను" అని మార్కు 6:6 చెప్పుతుంది. మత్తయి రచనయైతే సంగతి కొంచెం వివరిస్తుంది: "యేసు వారి సమాజమందిరములలో బోధించుచు రాజ్య సువార్త ప్రకటించుచు, ప్రతివిధమైన రోగమును, ప్రతివిధమైన వ్యాధిని స్వస్థపరచుచు, సమస్త పట్టణముల యందును గ్రామముల యందును సంచారము చేసెను" (9:35).

తన బోధ వినవచ్చిన వారిని చూచి "వారు కాపరిలేని గొఱ్ఱెలవలె విసికి చెదరియున్నందున వారిమీద కనికరపడి" (మత్తయి 9:36).[5] ఆత్మ సంబంధమైన నాయకత్వం సరిగా లేనప్పుడు పాత నిబంధనలో ఈలాటి భాషా ప్రయోగమే చేయబడింది (సంఖ్యా. 27:17; 1 రాజులు 22:17; యెహెజ్కేలు 34:5).

సమరయులను గూర్చి గతంలో ప్రభువు తన శిష్యులకు యిలా తెలిపారు, "ఇదిగో మీ కన్నులెత్తి పొలములను చూడుడి; అవి ఇప్పుడే పండి కోతకు[6] వచ్చియున్నవని మీతో చెప్పుచున్నాను" (యోహాను 4:35బి). గలిలయులను గూర్చి అలాటి పదజాలాన్నే ఆయన వినియోగించారు: "కోత విస్తారమేగాని పనివారు కొద్దిగా ఉన్నారు" (మత్తయి 9:37). ఇక్కడ పనివారిని గూర్చి ప్రస్తావించారు. "గనుక తన కోతకు పనివారిని పంపుమని కోత యజమానుని వేడుకొనుడని తన శిష్యులతో చెప్పెను" (మత్తయి 9:38). తన స్వదేశీయులను సందించడానికి క్రీస్తుకు సహాయం అవసరమైయుంది.

### చిక్కు స్థితికి పరిష్కారము

**(మత్తయి 10:1-42; మార్కు 6:7-11; లూకా 9:1-5)**

తక్కువ సంఖ్యలో ఉన్న పనివారికి పరిష్కారముగా యేసు ఆ ప్రాంతంలోని పట్టణాలకు తన పన్నిద్దరు అపొస్తలులను పంపుతారు. ఆ ప్రాంతీయులందరును "రాజ్య సువార్త" వినే అవకాశం గ్యారంటీ చేయబడింది (మత్తయి 9:35). రెండవది, ఆ పన్నిద్దరికి చాలినంత తర్ఫీదు అవకాశాలు యివ్వబడ్డాయి - క్రీస్తు తమయొద్ద యిక ఎన్నడూ శరీరధారిగా ఉండని అవసరమైన అనుభవం వారు పొందనున్నారు. యేసు తొలిగా గలిలయ ప్రాంతంలో సంచరించినప్పుడు కేవలం కొద్దిమంది శిష్యులు మాత్రమే ఉన్నారు.[7] రెండవమారు పన్నిద్దరు ఆయనతో కూడ ఉన్నారు.[8] ఆయన ఎలా బోధించుతూ పరిచర్య జరిగిస్తున్నారో వారు గమనిస్తూ వచ్చారు. వారిని స్వతంత్రంగా ఉండునట్టు పంపే సమయం అసన్నమయ్యింది.[9]

విజయానికి సిద్ధపాటు అవసరం. ముఖ్యమైన తమ పనికొరకు ప్రభువు వారిని సిద్ధపరచడంలో అశ్రద్ధ చూపలేదు.

(1) అపొస్తలులను తయారు కావించడం, ఆయన చక్కగా నిర్వహించారు. ఇద్దరిద్దరిని జట్టుగా ఆయన వారిని విభాగించారు (మార్కు 6:7). మత్తయి 10:2-4లోని అపొస్తలుల జాబితాను పరికించు. వారు యిద్దరిద్దరు ఒక జట్టుగా కన్పిస్తారు. ప్రభువు వారిని ఎలా పంపారో యిది సూచిస్తుంది, ఇద్దరినిగా పంపడంలో వారి సందేశానికి బలం చేకూర్చబడింది (ద్వితీయో. 17:6; 19:15; మత్తయి 18:16; యోహాను 8:17;

2 కొరింథీ. 13:1; 1 తిమోతి 5:19). అది వారికి పరస్పర బలము చేకూరినట్టయ్యింది. ఒకరి పనిని ఒకరు పూరించి (సంపూర్తి చేసి) ఒకరినొకరు బలపరచుకునేలా చేసింది. ఒక్కొక్క జట్టు ఎక్కడెక్కడికి వెళ్లవలెనో క్రీస్తు నియమించినట్టున్నారు. "వారి పట్టణములలో బోధించడానికిని ప్రకటించడానికిని అక్కడనుండి వెళ్లిపోయెను" అని మత్తయి 11:1 అంటుంది.[10] అవి వారికి నియమించిన పట్టణాలైయుండవచ్చు (లూకా 10:1తో దీన్ని పోల్చిచూడు). ఆ ప్రయాణం ఎంత కాలం కొనసాగాలి, అది ముగిసిన పిమ్మట అపొస్తలులు ఎక్కడికి వెళ్లాలి అనే సంగతులు కూడా ముందుగానే నిర్ణయింపబడినట్టున్నాయి (మార్కు 6:30; లూకా 9:10 చూడు).

(2) అపొస్తలులను సిద్ధపరచడంలో ఆయన వారికి ఉపదేశించారు.[11] సవిస్తారమైన క్రీస్తు ఉపదేశం సిద్ధపరచడంలో బహు ప్రాముఖ్యమైన పాత్ర వహిస్తుంది.

*ఏమి చేయాలో ఆయన వారికి తెలిపారు.* వారు కేవలం యూదుల మధ్యకు మాత్రమే వెళ్లవలసినదిగా వారికాజ్ఞాపించారు (మత్తయి 10:5, 6). తరువాత, వారు "యితర గొఱ్ఱెల" కొరకు అక్కర కలిగియుండాలనుకో (అన్యజనులు; యోహాను 10:16 చూడు). ఈ ప్రయాణంలోనైతే, వారు కాపరిలేని గొర్రెలమీద తమ దృష్టిని నిలపాలి (మత్తయి 9:36) – అంటే, "ఇశ్రాయేలు యింటివారిలో నశించిన గొఱ్ఱెల యొద్దకే" వారు పంపబడ్డారు (మత్తయి 10:6).[12]

ఆ పన్నిద్దరు యూదుల మధ్యకు వెళ్లినప్పుడు, వారు బోధించాలి. "సమీపముగా నున్న"దను రాజ్య సువార్తను వారు ప్రకటించాలి (మత్తయి 10:7). మారుమనస్సు పొందునట్లుగా వారు ప్రజలకు ఆజ్ఞాపించాలి (మార్కు 6:12 ; మత్తయి 4:17 చూడు). వారు జనులకు యేసును గూర్చి తెలపాలి.[13]

పైగా, వారు పయనిస్తూ బోధిస్తుండగా, వారు అద్భుతాలు చేస్తూ ఉండాలి (లూకా 9:6 చూడు). "రోగులను స్వస్థపరచుడి, చనిపోయిన వారిని లేపుడి,[14] కుష్ఠరోగులను శుద్ధులుగా చేయుడి, దయ్యములను వెళ్లగొట్టుడి" అని ఆయన వారికి ఆదేశించారు (మత్తయి 10:8ఎ). దీన్ని గూర్చి తరువాత ఎక్కువగా చెప్పుతాను.

*ఏమి తీసుకొని వెళ్లాలో ఆయన వారికి తెలిపాడు.* వారు కేవలం అత్యవసరమైనవి తీసికొని పోయి, వారు వెళ్లిన చోట్లలో తమ్మును చేర్చుకొనువారి ఆతిథ్యాన్ని వారు పొందాలి–లేక దాని మీద వారు ఆధారపడాలి.[15] "పనివాడు జీతమునకు పాత్రుడని" ఆయన వారికి తెలిపాడు (మత్తయి 10:10బి). ఈ విధంగా, క్రీస్తు వారి పనియొక్క వేగాన్ని ఆయన తెలియజేశారు. జీవిత అవసరతల కొరకు దేవుని మీద ఆధారపడవలె (నమ్మికయుంచవలె)నని కూడా ఆయన వారికి బోధించారు (లూకా 22:35; మత్తయి 6:33 చూడు).

*ఏమి ఎదురు చూడాలో ఆయన వారికి తెలిపాడు.* కొందరు వారి సందేశాన్ని అంగీకరిస్తారు (మత్తయి 10:11, 13ఎ). అయితే అనేకులు దాన్ని త్రోసివేస్తారు (మత్తయి 10:13బి, 14, 16, 17, 21, 22, 24, 25).

*ఎలా స్పందించాలో ఆయన వారికి తెలిపారు.* వారు చేయకూడని కొన్ని పనులున్నాయి. వారిని గాని, వారి సందేశాన్నిగాని నిరాకరించేవారితో సమయాన్ని వ్యర్థం చేయవద్దు.

“ఎవడైనను మిమ్మును చేర్చుకొనక మీ మాటలు వినకుండిన యెడల మీరు ఆ యింటినైనను ఆ పట్టణములనైనను విడిచి పోవునప్పుడు మీ పాద ధూళి దులిపి వేయుడి” (మత్తయి 10:14). ఆ దినమున, పాదధూళి దులిపివేయడం నిరాకరింపబడిన దాన్ని సూచిస్తుండేది.[16] ప్రజలు దైవ సందేశాన్ని తిరస్కరించినప్పుడు, దేవుడు వారిని తిరస్కరించాడు.

తిరస్కారంతో వారు భయపడ నక్కరలేదు (మత్తయి 10:26, 28). వారి విశ్వాసాన్ని ధైర్యముగా ప్రకటించడానికి క్రీస్తు వారికి ధైర్యమునిచ్చారు (మత్తయి 10:27). “మనుష్యులయెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును. మనుష్యుల ఎదుట ఎవడు నన్ను ఎరుగననునో వానిని పరలోకమందున్న నా తండ్రియెదుట నేనును ఎరుగనందును” అని ఆయన వాగ్దానం చేశారు (మత్తయి 10:32, 33). ఈ వాగ్దానములు ఏ ఒప్పుకోలుకైనా వర్తిస్తాయి.[17] ఈ సందర్భంలోనైతే, మనుష్యుల ఎదుట అనుదినం ఆయనను గుర్తించుటకు వర్తిస్తుంది.

తిరస్కారానికి బదులుగా ఆ పన్నిద్దరు చేయవలసిన పనులు యింకా ఉన్నాయి. వారు మనుష్యులచే నిరాకరింపబడినా, దేవునిచేత నిరాకరింపబడలేదన్న సత్యాన్ని వారు నేర్చుకోవాలి. ఇంకను ఆయన వారిని లక్ష్యపెట్టుతూ ఉంటారు (మత్తయి 10:29–31). తమ్మును నిరాకరించినవారు శపింపబడతారు (మత్తయి 10:13–15).

(3) తన అపొస్తలులను సిద్ధపరచడంలో ప్రభువు వారిని నిర్వహించడం, ఉపదేశించడం మాత్రమేగాక, ఆయన వారిని శక్తితో నింపారు. తమ కార్యమును సఫలము చేయడానికిగాను అవసరమైన దానిని ఆయన వారికిచ్చారు. పరిమితి ఆదేశ కాలము వరకు, కేవలం క్రీస్తు మాత్రమే అద్భుతాలను చేశారు. అలాటి కార్యాలను జరిగించడానికి ఆయన వారికిని శక్తినొసంగారు. “ఆయన తన పండ్రెండు మంది శిష్యులను పిలిచి, అపవిత్రాత్మలను[18] వెళ్లగొట్టుటకును, ప్రతివిధమైన రోగమును ప్రతివిధమైన వ్యాధిని స్వస్థపరచుటకును, వారికి అధికారమిచ్చెను” (మత్తయి 10:1; మార్కు 6:7; లూకా 9:1లను చూడు). పైగా, అవసరతనుబట్టి దైవప్రేరేపణను ఆయన వారికిచ్చారు:

> వారు మిమ్మును అప్పగించునప్పుడు, – ఏలాగు మాటలాడుదుము? ఏమి చెప్పుదుము? అని చింతించకుడి; మీరేమి చెప్పవలెనో అది ఆ గడియలోనే మీకను గ్రహింపబడును మీ తండ్రి మిలో ఉండి మాటలాడుచున్నాడే గాని మాటలాడు వారు మీరు కాదు (మత్తయి 10:19, 20).

అపొస్తలులను ప్రభువు ఎలా సిద్ధపరచారు అని మనం ఆలోచిస్తుండగా, గలిలయలోని రెండు మూడు వారాల ప్రయాణానికి మాత్రమే ఆయన ఉద్దేశించలేదని మనకు గ్రాహ్యమౌతుంది. “అధిపతులు,” “రాజులు,” “అన్యజనులు” (మత్తయి 10:18) మరియు హింసింపబడే ప్రవచనాలు (మత్తయి 10:17, 18, 21–23, 34–39), సంఘ స్థాపన అనంతరం అపొస్తలుల పనిని, వారు ట్రీట్ (treat) చేయబడే విధానాన్ని సూచిస్తున్నట్లు కన్పిస్తుంది.[19]

పరిమితి ఆదేశాన్ని[20] క్రీస్తు జారీచేసినప్పుడు, మత్తయి 10లో, ఆయన వివరాలతో

కూడిన హెచ్చరికలిచ్చారు. కాని ఆయన మత్తయి 28:18-20లో[21] గ్రేట్ కమిషన్ను (ఘనత్వముగల ఉత్తరువును) జారీచేసినప్పుడు  కేవలం చేయండి అన్నట్టు ఆయన చెప్పారు.[22] ఏమి చేయాలో, తమ ప్రకటనకు ఏమి ఎదురుచూడాలో ముందుగానే ఆయన తన శిష్యులకు తెలిపినందున కాబోలు అలాటిది మత్తయి 10వంటి లేఖన భాగాల్లో ఉంది.

మత్తయి 10లోని కొన్ని ప్రత్యేకమైన ఏర్పాట్లు నేడు మనకు వర్తింపవు. మనం యూదుల యొద్దకే వెళ్లనక్కర లేదు (మత్తయి 28:19; మార్కు 16:15). అపొస్తలులవలె మనం అద్భుతరీతిగా శక్తితో నింపబడడం, మనం మాట్లాడేటప్పుడు అద్భుతరీతిగా దైవ ప్రేరేపణతో మనం పలుకం. ప్రసంగించడానికి ఎక్కడికో మనం వెళ్లినప్పుడు ఏమియు తీసికొనకుండ ప్రయాణం చేయ నవసరం లేదు.[23] అయినా, మత్తయి 10లోని అనేక సూత్రాలు 21వ శతాబ్దంలో ఉన్నవారికిని చట్టరీతిగా చెల్లుతాయి.

లోకానికి మనం సువార్త తీసికొని పోకముందు, మనకు ప్లానింగు, ఆర్గనైజేషన్ కూడా కావాలి. ప్రభువు యొక్క అర్గనైజేషన్ సవిస్తరమైయుంది కాదు. అలాగే మనది కూడా ఎంత సింపుల్గా ఉండడానికి కుదురుతుందో అంత సింపుల్గా ఉండాలి. పని జరిగించడానికి అవసరమైనంత మట్టుకు దాన్ని కుదించాలి. నిర్వహణకు మనం ఎక్కువ సమయం వెచ్చించినట్టయితే, మనం ఏ పనియు చేయడానికి కుదరకపోవచ్చు. కామన్ సెన్స్ అవసరం. మత్తయి 10:16లోని మాటలయందున్న జ్ఞానాన్ని ఆలోచించు.

క్రీస్తు యొక్క కార్య నిర్వహణ ఆదేశాలలో మనం తీవ్రంగా ఆలోచించవలసిన ఒక విషయమేమంటే – అపొస్తలులను యిద్దరిద్దరినిగా పంపడం, జట్టులుగా మిషనెరీలను పంపడంలో విలువుంది.

సువార్త యితరుల యొద్దకు తీసికొని పోకముందు మనకు యింకను సిద్ధపాటు అవసరమైయుంటుంది. ప్రభువు పన్నిద్దరిని పంపకముందు ఆయన వారికి ఆజ్ఞాపించారు (5 వ. 11:1ని కుడా చూడు). ఏమి చేయాలి, ఎలా చేయాలనేది ప్రతిఒక్కరికి తెలుసునని ఊహించుకో. ఆజ్ఞల విషయంలో ఎన్నడే దాటిపోకు.[24] పైగా, సువార్తను మనం తీసికొని పోయేటప్పుడు దేవుడు మనలను గమనిస్తున్నాడని గుర్తించాలి (10:28-31). అంతం వరకు సహించేలా యింకను మనం ప్రోత్సహింపబడవలసియుంటుంది (22 వ.).

### ప్రయాస యొక్క విజయం (మత్తయి 11:1; మార్కు 6:12, 13; లూకా 9:6)

ప్రభువు ఆజ్ఞాపించడం ముగించిన పిమ్మట, యిద్దరిద్దరుగా అపొస్తలులు ఆరు జట్లుగా బయలుదేరారు "కాగా వారు బయలుదేరి, మారుమనస్సు పొందవలెనని ప్రకటించుచు అనేక దయ్యములు వెళ్లగొట్టుచు నూనె రాచి అనేక రోగులను స్వస్థపరచు చునుండిరి" (మార్కు 6:12, 13). తమ యజమానుడు చేసిన అనేకమైన గొప్పకార్యాలను వారు తొలిసారిగా చేశారు. వారు ఉల్లసించియుంటారని నీకు తెలియదా![25]

వారు వెళ్లిన తరువాత, ఆ ప్రాంతంలో క్రీస్తు తన సొంత పర్యటనను సాగించారు

(మత్తయి 11:1). ఇప్పుడు గలిలయ రాష్ట్రంలో గుండా ఒక జట్టు పర్యటించడానికి బదులు ప్రకటించుచుతూ, స్వస్థపరచుతు నుండే ఏడు టీములు ఈ కార్యాన్ని చేపట్టాయి!

## తీవ్రమైన బెదిరింపు (మత్తయి 14:1-12ఎ; మార్కు 6:14-29; లూకా 9:7-9)

### తటాలున హేరోదుకు తెలిసింది

మనకు ముందుగా తెలిసినట్టే, గలిలయ రాజైన హేరోదు పాలనలో ఉంది. ఇతడు మహా హేరోదు కుమారుడైన అంతిప హేరోదు.[26] క్రీస్తు ఆ పన్నిద్దరిని బయటికి పంపకముందు, హేరోదు ప్రభువు చర్యలను పట్టించుకోనట్టున్నాడు. చట్ట ప్రకారం, మూకను తిరుగుబాటుకు రేపకుండ శాంతియుతంగా సంస్కరణలు జరిగినంత కాలము, ప్రభుత్వం ఆలాటి వారిని పట్టించుకోదు. తాను ఏలుచున్న ప్రాంతాన్ని ఆ ఏడు జట్లు సువార్తతో కలవరం కలిగించేటప్పటికి, ఈ నూతన ఉద్యమాన్ని హేరోదు అలక్ష్యం చేయలేక పోయాడు.

"ఆ సహాయమందు చతుర్థాధిపతియైన హేరోదు యేసును గూర్చిన సమాచారము విని" యున్నట్టు మత్తయి అంటున్నాడు (మత్తయి 14:1). ఈ పన్నిద్దరి చర్యను సంక్షిప్తం చేశాక (6:13) మార్కు తన రచనలో యిలా అన్నాడు: "ఆయన కీర్తి ప్రసిద్ధమాయెను గనుక రాజైన హేరోదు ఆయనను గూర్చి విని ..." (6:14ఎ). లూకా అపొస్తలుల విజయాన్ని దాఖలు చేసిన తరువాత (9:6) యిలా అన్నాడు: "చతుర్థాధిపతియైన హేరోదు జరిగిన కార్యములన్నిటిని గూర్చి విని, యెటుతోచక యుండెను" (9:7ఎ).

### హేరోదుకు బాధకరమైన పిరికితనం ఏర్పడింది

ప్రభువైన యేసును గూర్చి ప్రజలు మాటలాడుకొంటున్న మాటలు హేరోదు చెవులకు వచ్చాయి: కొందరు ఆయన ఏలీయా అన్నారు; ఎవరో ప్రవక్త మృతులలోనుండి లేచాడని మరికొందరను కొంటున్నారు (లూకా 9:8; మార్కు 6:15).[27] హేరోదును పిరికి వానిగా చేసింది, ఏమైయున్నా, కొందరు యిలా అనుకొంటున్నారు – "బాప్తిస్మమిచ్చు యోహాను మృతులలోనుండి లేచాడు[28] గనుక అతనియందు అద్భుతములు క్రియా రూపములగు చున్నవని చెప్పెను"[29] (మార్కు 6:14బి; లూకా 9:7బి లను చూడు). ఇది హేరోదును పిరికివానిగా చేస్తుంది. ఎందుకంటే కొద్దికాలానికి ముందు అతడు యోహాను తలను కొట్టించాడు.[30]

ఒక సంవత్సరానికి ముందుగా కావచ్చు,[31] తాను ఉంచుకున్న దాని నిమిత్తము హేరోదు ప్రవక్తను చెరసాలలో వేశాడు. తన సహోదరుడైన ఫిలిప్పు భార్యయైన హేరోదియను ఆకర్షించి ఆమెను తన భార్యగా ఉంచుకున్నాడు (మత్తయి 14:3).

హేరోదియ కూడా మహా హేరోదు నుండి వచ్చిందే. ఆమె హేరోదుకు బంధువే.[32] హేరోదు అంతిపతో ఆమె పెండ్లి అనేక లేవీయ ధర్మాలను మీరింది.[33] "హేరోదియను ఉంచుకొనుట న్యాయముకాదని" హేరోదుకు చెప్పగల ధైర్యం యోహానుకు ఉంది (4 వ.). అది హేరోదియకు కోపం పుట్టించింది (మార్కు 6:19).[34]

యోహానును చంపించాలని హేరోదియ కోరుకున్నప్పటికి (మార్కు 6:19), అంత దూరం వెళ్లడానికి హేరోదు సంకోచిస్తున్నాడు. ప్రవక్త మరణం తిరుగుబాటు తెస్తుందేమోనని అతని భయం (మత్తయి 14:5 చూడు). అంతేగాక, యోహాను పట్ల అతనికి అసూయతోకూడిన గౌరవం ఉంది. మార్కు యిలా వ్రాశాడు. "ఎందుకనగా యోహాను నీతిమంతుడును, పరిశుద్ధుడునగు మనుష్యుడని హేరోదు ఎరిగి, అతనికి భయపడి అతని కాపాడుచు వచ్చెను" (6:20ఎ). తరువాత మార్కు ఈ వింతైన సంగతిని గుర్తిస్తున్నాడు: "మరియు అతని మాటలు వినినప్పుడు, ఏమిచేయను తోచక పోయినను సంతోషముతో వినుచుండెను" (6:20బి).[35] యోహాను తన అనాగరికమైన వస్త్రధారణ లోను, తన రాజ వస్త్రాలతో నాజూకుగా కన్పించే హేరోదు ముందు నిలిచి ఉండడాన్ని ఊహించడం కష్టం కాదు. ప్రవక్త అతనివైపు తన వేలిని కదిలించినప్పుడు, రాజు ముఖంలో వ్యాకులత కన్పించడం వింత కానవసరం లేదు. "యోహానుతో ఎప్పుడు మాటలాడినను, హేరోదు కలతచెందుతాడు, అయినను అతడు (హేరోదు) అతని (యోహానను) వినడానికి యిష్టపడేవాడు" అని (Living Bible) వర్ణించింది.

హేరోదియనుండి హేరోదు యోహానును కాపాడుతునే వచ్చాడు. జన్మదిన సంబంధంగా విందు చేయించే నాటివరకు యిది కొనసాగింది (మత్తయి 14:6; మార్కు 6:21). ఉన్మత్త ప్రమోదంతో[36] హేరోదియ కుమార్తె నాట్యం చేయడానికి విందు శాలలోనికి ప్రవేశించింది (మత్తయి 14:6; మార్కు 6:22). ఆ బాలిక పేరు సలోమియని జోసీఫస్ అన్నాడు. నాట్యం చేస్తున్న ఆమె పద్ధతిలో నమ్రత అనేది లేనట్టు స్పష్టంగా వ్యక్తపరచబడింది.[37] తన దుష్ట ఉద్దేశాలను నెరవేర్చుకొనడంలో హేరోదియ తన కుమార్తెను యిలా ఉపయోగించుకొనడం[38] త్రాగుబోతుల సహవాసుల ఎదుట తన మారు కుమార్తె తన్నుతాను ప్రదర్శించుకోడాన్ని రాజు అనుమతించిన వాస్తవం హేరోదు కుటుంబ శీలం ఎలాటిదో బయలుపరచుతుంది.

సలోమి నాట్యం "హేరోదును అతనితోకూడ పంక్తిని కూర్చున్నవారిని సంతోష పరచెను" అని లేఖనమంటుంది (మార్కు 6:22ఎ). ఆ నాట్యం వారిని ఎందుకు సంతోషపరచిందో గ్రహించడం కష్టం కాదు. ఆ బాలికతో రాజు యిలా అంటున్నాడు (అతని స్వరంలోని అస్పష్టతను నేను వినగలను) "నీకిష్టమైనది ఏదైనను నన్నడుగుము, నేను నీకిచ్చెదను" (మార్కు 6:22బి). అతడు ప్రమాణంతో ఒట్టుపెట్టుకున్నాడు, "మరియు – నీవు నా రాజ్యములో సగము మట్టుకు ఏమి అడిగినను నీకిచ్చెదనని అతడు ఆమెతో ఒట్టుపెట్టుకొనెను"[39] (మార్కు 6:23; మత్తయి 14:7).

రాజుగారి రాజ్యంలో భాగం ఇస్తానని అంటే, అంతకు మించినదేముంటుంది?[40] సలోమి సందేహించలేదు. "అప్పుడామె తన తల్లిచేత ప్రేరేపింపబడినదై– బాప్తిస్మమిచ్చు యోహాను తలను ఇక్కడ పళ్లెములో పెట్టి నాకిప్పించుమనియడిగెను" (మత్తయి 14:8)[41]

హేరోదియకు ఆయన మరణపు వార్త అక్కరలేదు; అది మోసము కావచ్చు.[42] ఆమె అతని దేహాన్ని చూడదలచుకోలేదు; ఆ మరణ దృశ్యం రంగస్థలం మీద ప్రదర్శింప బడవచ్చు. కాని వేరుచేయబడిన ఆయన తలను, దానినుండి కారే సజీవ రక్తం మాత్రమే ఆమెకు సంతృప్తి కలిగిస్తుంది. పైగా, ఆ ప్రవక్త యొక్క శిరస్సు ఆమెకు "ఇప్పుడే" (వెంటనే) కావాలి (మార్కు 6:25) – హేరోదు మనస్సు మారక ముందే కావాలి.

వెంటనే రాజుకు దుఃఖం కలిగింది. తన ప్రమాణాన్ని విన్న వారి మధ్య తన పరువుపోకుండా ఉండడానికి, యోహాను శిరచ్ఛేదనకు అతడు ఆజ్ఞ యిచ్చాడు. ఆ పని వెంటనే జరిగిపోయింది:

> వెంటనే రాజు అతని తల తెమ్మని ఆజ్ఞాపించి యొక బంట్రౌతును పంపెను. వాడు వెళ్లి చెరసాలలో అతని తల గొట్టి పళ్లెములో అతని తల పెట్టి తెచ్చి ఆ చిన్నదాని కిచ్చెను. ఆ చిన్నది తన తల్లికిచ్చెను (మార్కు 6:27, 28).

ఆ కార్యము హేరోదియకు సంతోషము కలిగించియుండవచ్చు, కాని అది హేరోదుకు మనశ్శాంతిని తొలిగించింది. అతడు తాను చేసిన పనికి దుఃఖించాడు (మత్తయి 14:9). మనస్సాక్షితో కూడిన హేరోదును ఊహించడం కష్టం. అయితే కనీసం అతడు బహుగా వ్యాకులపడ్డాడు. అలాగున, మూక యొక్క మూఢ విశ్వాసంతో కూడిన ఉహాగానాన్ని అతడు విన్నప్పుడు, రానున్న దుశ్శకునాలతో అతని మనసు నిండింది. "– నేను తలగొట్టించిన యోహానే మృతులలోనుండి లేచియున్నాడని" హేరోదు చెప్పుతున్నట్టు మార్కు రికార్డు చేశాడు (మార్కు 6:16; మత్తయి 14:2 చూడు).

## హేరోదు అపాయకరంగా కుతూహలపడుతున్నాడు

అతడు నిజంగా యోహానో కాదో తెలిసికొని సంతృప్తి చెందగోరి హేరోదు యేసును చూడ తీర్మానించుకున్నాడు (లూకా 9:9ఎ). "యెవని గూర్చి యిట్టి సంగతులు వినుచున్నానో అతడెవడో అని చెప్పి ఆయనను చూడగోరెను" (లూకా 9:9బి). నీవు ఈ మాటలు చదువుచుండగా, గలిలయలో హేరోదు స్వాధీనంలో ఉన్న మార్గాలను గూర్చి ఆలోచించు. క్రీస్తువంటి బహిరంగ పరిచర్యగల ఒకరు హేరోదు కంటబడడం కష్టం కాదు.

కోరని, ఈ అడుగని ఈ దృష్టి క్రీస్తుకు అపాయాన్ని తెచ్చిపెట్టినట్టయ్యింది. పశువులు మేసే స్థలం గుండా నీవు వెళ్లుతున్నప్పుడు ఎద్దు దృష్టిని నీవు రాబట్ట పనిలేదు. కందిరీగ గూటి సమీపంలో నీవు ఉన్నట్టయితే, కొట్టే ఆ కీటకాల దృష్టిని నీవు ఆకర్షించ పనిలేదు. దుర్బలులపై బలముచూపి బాధించేవాడు నా పొరుగువాడై యుంటే, నా పైకి అతని దృష్టి మళ్లకుండేలా చూచుకుంటా.

యేసును చూడాలనే హేరోదు యొక్క కూతూహలం క్షీణించిపోలేదని తరువాత మనం తెలిసికొంటాం. భూమిపై క్రీస్తు పరిచర్యలోని చివరివారంలో – "ఆయనను గూర్చి చాల సంగతులు విన్నందున ఆయన ఎద్దైనను ఒక సూచక క్రియచేయగా చూడ నిరీక్షించి,

బహు కాలమునుండి ఆయనను చూడగోరెను" (లూకా 23:8). యేసును ప్రశ్నించిన మీదట, క్రీస్తు తనకు రానున్న ఆపదయైనట్టు అతడు కనుగొనియుండిన పక్షమందు, అతడు ఆయనను నిశ్చయముగా చంపనాజ్ఞాపించియుండేవాడే (లూకా 13:31-33).[43] అవును, క్రీస్తు పనియందు రాజుకున్న అక్కర నిజమైన ఆపదయైయుంటుంది.

## పధకాను సారం తొలగిపోవుట (మత్తయి 14:12బి, 13; మార్కు 6:30-32; లూకా 9:10; యోహాను 6:1)

### కావలసిన వివరం

ఈ మధ్యకాలంలో, యేసు తన పర్యటను ముగించారు. మరియు ఆయనయు ఆయన శిష్యులును తిరిగి కలిసికొన్నారు.[44] "అపొస్తలులు తిరిగివచ్చి, తాము చేసినవన్నియు ఆయనకు తెలియజేయగా" (లూకా 9:10ఎ; మార్కు 6:30; మత్తయి 14:12బి చూడు). "పని ముగించిన తరువాత ప్రశ్నించుకొనడం" వారి తర్ఫీదులో కీలకమైన పాత్రను వహించింది. వారు ఏమి చేశారో, ఏ (పద్ధతి) పని చేసింది, ఏది పని చేయలేదో మాట్లాడుకోవలసిన అవసరముంది. వారు తమ లోపాలను ఒప్పుకొని, "ఏమి చేసియుండవలసింది?" వారు అడగాలి. వారు అడుగవలసిన ప్రశ్నలు ఎన్నో ఉన్నాయి.

క్రీస్తు తన శిష్యులకు సహాయపడ ప్రయత్నించినప్పుడు సహితం, జనసమూహాలు వారి చుట్టు మూగాయి. వారి సువార్త పర్యటనలను గూర్చి ముచ్చటించుకునే సంగతిని ప్రక్కకు పెట్టి  అనేకమంది ప్రజలు వస్తూ పోతూ ఉండడంలో భోజనం చేయడానికి కూడా వారికి సమయం లేకపోయింది (మార్కు 6:31బి).[45]

### విచారకరమైన రిపోర్టు

యోహాను మరణానంతరము, దుఃఖభరితులైన అతని శిష్యులు కూడా అతని దేహాన్ని తీసికొని సమాధి చేయడానికి అనుమతింపబడ్డారు (మార్కు 6:29; మత్తయి 14:12ఎ చూడు). ఆయన అపొస్తులులు తన యొద్దకు చేరే సమయానికి, ఈ విషయం ఆయనకు చెప్పబడింది[46] (మత్తయి 14:12బి). అతని శిష్యులే ప్రభువునకు ఈ వర్తమానమిచ్చారు

### ప్రయోజనకరమైన రిట్రీట్

యోహాను మరణాన్ని గూర్చి ప్రభువు విన్న తరువాత, "ఆయన దోనె యెక్కి అక్కడనుండి అరణ్య ప్రదేశమునకు ఏకాంతముగా వెళ్లెను" (మత్తయి 14:13ఎ; మార్కు 6:31).[47] ఇలా వెళ్లడంలో రెండు కార్యాలు జరిగాయి. మొదటిది, క్రీస్తును, ఆయన శిష్యులను అది హేరోదు భూభాగంలోనుండి తొలిగించింది. అప్పటినుండి, క్రీస్తు కొద్దికాలమే గలిలయలో గడిపారు. అప్పుడప్పుడు జరిగే క్లుప్త పర్యటనలు మినహాయించి, గలిలయలలో అధికంగా ఆయన పని ముగిసిపోయింది.

రెండవదిగా, తన శిష్యులతోనే క్రీస్తు కాలం గడుపవలసిన అవసరతను బట్టి[48] వెళ్లవలసివచ్చింది. వారందరు యిప్పుడే కష్టమైన పర్యటను ముగించుకొని తిరిగి వచ్చి కలిసికొన్నారు. వారి దేహాలు విశ్రాంతి కోరుతున్నాయి (మార్కు 6:31ఎ). పైగా, వారి తొలి సువార్త ప్రయాణంలో జరిగినవన్నిటిని ప్రభువు ముందు పెట్టి ఆయన సహాయాన్ని వారు పొందనున్నారు. ఆయనను వారికి సహాయము చేయమన్నారు.

మరోసారి, వారు గలిలయ సముద్రము దాటి తూర్పువైపుకు వెళ్లనైయున్నారు.[49] మత్తయి మార్కులు – వారి అరణ్య ప్రదేశమునకు "ఏకాంతముగా వెళ్లినట్టు" చెప్పారు (మత్తయి 14:13ఎ; మార్కు 6:31ఎ). లూకా అయితే వారు "బేత్సయిదా అను ఊరికి ఏకాంతముగా వెళ్లెను" అని అన్నాడు (లూకా 9:10బి). సముద్రానికి సమీపంలో బేత్సయిదా అనే ఊళ్లున్నాయి.[50] కపెర్నహూము సమీపమున ఉన్న దానితో మనం యింతకు ముందే పరిచయం కలిగియున్నాం (మార్కు 6:45).[51] ఇంకొకటి, యేసును ఆపన్నిద్దరును యిప్పుడు వెళ్లింది గలిలయ సముద్రానికి ఈశాన్యదిశగా ఉన్నది. దీని పూర్తి పేరు బేత్సయిదా జూలియస్.[52] వారి గమ్యం సముద్ర తీరాన ఉన్న అరణ్య ప్రదేశం – పట్టణానికి ఎక్కువ దూరం ఉండదు.

## ముగింపు

విశ్రాంతి కొరకైన వారి ఎదురుచూపునంతటిని పాడుచేస్తూ, క్రీస్తు మరియు ఆయన అపొస్తలుల కొరకు వేచియున్న జనసమూహాల కథను మనం తరువాత ఆరంభిస్తాం. మన పఠనంలో ఈ భాగాన్ని ముగిస్తున్నప్పుడు, మన పాఠంలోనుండి అయిదు సంగతులను లాగుదాం.

(1) "కోత విస్తారముగా ఉన్నది పనివారు కొందరే" అనే సంగతి యింకను సత్యమే అయ్యింది. (మత్తయి 9:37). మన దేవుడు అహ్వానిస్తున్నారు, మనం స్పందిస్తాం.

(2) "కోత యజమానుడు" దేవుడే అన్నది యింకను సత్యమే (మత్తయి 9:38). ఆయన వృద్ధి కలుగజేస్తారు (1 కొరింథీ. 3:6). మనం ఆసక్తి కలిగియుందాం – దేవుడు దీవిస్తాడు.

(3) "ఉచితముగా పొందితిరి, ఉచితముగా యియ్యుడి" అనేది యింకను సత్యమే (మత్తయి 10:8). ఔదార్యం కలిగియుండ నేర్చుకుందాం. – మన దేవుడు లక్ష్య పెట్టువారు.

(4) ఆత్మ సంబంధమైన విజయమునకు ఆత్మసంబంధమైన శక్తుల వలన అపాయమున్నది అనేది యింకను సత్యమే (ఎఫెసీ. 6:12). ధైర్యము కలిగి యుందాం, మన దేవుడు కాపాడువాడు.

(5) శోధనలు వచ్చినప్పుడు తప్పించుకొను మార్గాన్ని దేవుడు ఏర్పాటు చేస్తాడనేది యింకను సత్యమైయున్నది (1 కొరింథీ. 10:13) – గలిలయ సముద్రానికి మరోవైపు, అయినా, నమ్మకముగా ఉందాం, మన దేవుడు ప్రసాదిస్తారు.

మనం కలిసి చదవడం క్రీస్తునకు సన్నిహితులను చేసి దేవునియందలి మన విశ్వాసాన్ని బలపరచాలని నా ప్రార్థన.

## సూచనలు

[1]మత్తయి 10:2–4లపై ఎక్కువ వివరాలకు “క్రీస్తు జీవితం భాగం 2లో,” “తుఫాను సమకూడుతుంది” అనే పాఠాన్ని చూడు. [2]నిజానికి యిది గలిలయ ప్రాంతంలో క్రీస్తు యొక్క చివరి పర్యటనయైయుంది. [3]హేరోదును గూర్చిన సమాచారానికి “క్రీస్తు జీవితం భాగం 1లో” “క్రీస్తు అవతరించిన లోకం” అనే పాఠం చూడు. [4]స్త్రీలు పిల్లలు కాక, భుజించినవారు 5000 మంది పురుషులు (మత్తయి 14:21). [5]“కాపరిలేని గొర్రెలు అనేది ఆత్మసంబంధమైన వారి అవసరతను చిత్రిస్తుంది; నడిపింపులేని, పోషణలేని, కాపుదలలేని వారిని సూచిస్తుంది. [6]దేవుడు “కోత యజమానుడు” ఎందుకంటె, “వృద్ధికలుగజేసేది” ఆయనే ( 1 కొరింథీ. 3:6, 7). [7]“అధికారము గలవానివలె” అనే పాఠాన్ని “క్రీస్తు జీవితం, భాగం 2లో” చూడు. [8]“విరామం లేని దినము,” “క్రీస్తు జీవితం, భాగం 2లో” చూడు. [9]పక్షులతో పరిచయం ఉన్న వారు దీనిని అర్థం చేసుకొంటారు. [10]ఈ పద ప్రయోగం శిష్యుల యొక్క సొంత పట్టణాలను సూచించే అవకాశముంది.

[11]ఇక్కడి పరిచయం ప్రభువు తన డెబ్బది మంది శిష్యులను పంపినప్పుడు (లూకా 10:1–16) యిచ్చిన ఆజ్ఞలతో పోల్చిచూడ వచ్చు. [12]ఈ పరిమితిని బట్టి మత్తయి 10, “Limited Commission” అని పిలువబడింది. దీనికిని మత్తయి 28:18–20కిని (“Great Commission”) మధ్య వ్యత్యాసముంది (అది అందరికి). [13]వారి బోధవలన ఆ ప్రాంతమంతటిలో యేసు నామము ప్రచురమైయున్నట్టు సూచింపబడింది (మత్తయి 14:1; మార్కు 6:13, 14లను చూడు). [14]రోగులను బాగుచేయడంతో చనిపోయిన వారిని బ్రదికించడం కూడా జతచేయబడింది. క్రమబద్ధంగా ఉండాలంటే, రోగులను బాగుచేసేవాడు చనిపోయిన వారిని సయితం బ్రదికించాలి. [15]మూడు రచనలోని ఆజ్ఞలను పోల్చినట్టయితే, వారిలో ప్రతి ఒక్కరు అవసరమైన వాటినే వస్త్రాల రూపంలో తీసికొనిపోవాలి. డబ్బుగాని భోజన పదార్థాలుగాని తీసికొని వెళ్లకూడదు. ఆతిథ్యం ఎరిగిన ప్రజల మధ్య కొద్ది వారాలే సంచరించడానికి ఈ పర్యటన ఉద్దేశింపబడింది. ప్రతి సువార్త పర్యటనలకు ఈ నిషేధాలు వర్తింపు కావు (లూకా 22:35, 36ను గమనించు). [16]45వ యేసు చేసిన Limited Commission పై నోట్సు చూడు. [17]ఈ లేఖన భాగాన్ని బాప్తిస్మం ముందు ఒప్పుకోలుకు కొన్ని సార్లు వర్తింపజేస్తారు. బహిరంగంగా ఒక్కసారి చేసే ఒప్పుకోలుకు యిది పరిమితం కాదని గ్రహించాలి. [18]“సమస్తమైన దయ్యముల మీద శక్తిని, అధికారమును'' క్రీస్తు వారి కిచ్చినట్టు లూకా వ్రాశాడు (లూకా 9:1). [19]చూపించబడిన వచనాలపై “అపొస్తలుల కార్యము” మంచి వ్యాఖ్యానమైయుంది. [20]“Limited Commission” పై జూలై 1989, జూలై 1990 ట్రూత్ ఫర్ టుడే ఆంగ్ల రచనలను చూడు.

[21]Great Commission మార్కు 16:15, 16లో యివ్వబడింది. లూకా 24:46, 47ల్లో అది పోలికగా చూపబడింది. [22]“కేవలం చేయుము” అనే నినాదమును ఆలోచించు. [23]కొరింథులో పని చేసినప్పుడు పౌలు కొంత సహాయాన్ని యితర స్థానిక సంఘాల నుండి పొందాడు (ఫిలిప్పీ. 4:15). [24]“రాజు ఆయన రాయబారులు” అనే ప్రసంగం ఆరంభమై మత్తయి 10నుండి నేటి వర్తింపుకు అక్కడ ఆదేశాలు తీసికొనబడ్డాయి. [25]ఈలాటి ప్రయాణంలో పంపబడిన 70 మంది ఉత్సాహాన్ని చూడు (లూకా 10:17). [26]“క్రీస్తు జీవితం, భాగం 2లో” కొందరు హేరోదులను చూడు. [27]దీన్ని మత్తయి 16:13, 14తో పోల్చి చూడు. యూదులు యేసును మెస్సీయా అనుకోలేదు. మెస్సీయ గొప్ప ఆడంబరంగాను, గంభీరంగాను వస్తాడని వారి ఉద్దేశం. ఆయన ప్రవక్తయై యుండవచ్చునని వారు అంగీకరించారు. యేసును గూర్చిన అంచనాలో మనుష్యులు కాల క్రమంలో తప్పిపోతునే ఉన్నారు. [28]యేసుకును, యోహానుకును వేరు వేరు పరిచర్యలు ఒకే సమయంలో ఉన్న సంగతి వారికి తెలియక పోయింది. విషయం తెలియకపోవడం మనుష్యులను వారి ఊహాలనుండి ఎన్నడే ఆటంకపరచలేదు. అంటే, తెలియకపోవడమనేది ఊహించకుండ మనుష్యులను ఆటంకపరచలేదు. [29]తన జీవిత దినాల్లో, యోహాను ఏ అద్భుతాలు చేయలేదు (యోహాను 10:41). అయితే, మృతులలోనుండి లేచిన వానికి మానవతీత శక్తులుంటాయని కొందరు నమ్ముతారు. [30]యోహాను మరణాన్ని గూర్చి యేసు విన్నప్పుడు, (ఆయన 5000 మందికి ఆహారము పెట్టిన ప్రాంతానికి) సముద్రముదాటి వెళ్లినట్టు మత్తయి 14:13 అంది. తమ గలిలయ పర్యటననుండి శిష్యులు తిరిగివచ్చిన కొద్ది సేపటికి వారు సముద్రము దాటి ఏకాంతముగా వెళ్లినట్టు మార్కు 6:30–32 అంటుంది. ఈ సంగతులను పోల్చిచూస్తే, యోహాను చంపబడే సమయానికి యేసు ఆయన శిష్యులు గలిలయ మూడవ ప్రయాణం చేస్తున్నట్టున్నారు. ఆ వార్త వచ్చేసరికి క్రీస్తు ఆ పర్యటన చివరిలో ఉన్నారు.

[31]“క్రీస్తు జీవితం, భాగం 2లో” చూడు. [32]“క్రీస్తు జీవితం, భాగం 2లో” – అంతిప హేరోదు, ఫిలిప్పు (హేరోదు ఫిలిప్పు 1) మరియు హేరోదియల సంబంధాలను గూర్చి చూడు. [33]సన్నిహిత బంధువుతో వివాహాన్ని ధర్మశాస్త్రము తప్పని చెప్పింది (లేవీ. 18:1–18; 20:11–21లను చూడు). సహోదరుడు యింకను బ్రదికియుండగా వాని భార్యను మరియొక

సహోదరుడు ఉంచుకొనడాన్ని కూడా అది నిషేధించింది (లేవీ. 18:16; ద్వితీయో. 25:5–10). [34]యోహాను ఎప్పుడు ఎలాగున తన సందేశాన్ని వినిపించాడో మనకు తెలియదు. అవకాశాలకొరకు, "క్రీస్తు జీవితం, భాగం 4లోని" మొదటి ప్రసంగం చూడు. [35]ఫేలిక్సు పౌలు సందేశం వినడంతో పోల్చిచూడు (అపొ. 24:24–26). [36]అది ఎలాటి విందో – నిజదేవుని ఎరుగని వారి విందులు, దానితో హేరోదు కుటుంబికుల మధ్యనున్న నైతిక ప్రమాణాలను బట్టి మనం గ్రహించుకోవచ్చు. [37]అలాటి పరిస్థితిలో ఉల్లాసం యొక్క తీరు ఎలాగుంటుందో వేరే రచయితల నుండి మనం తెలిసికోవచ్చు. సలోమి యొక్క ప్రదర్శనం "ఏడు చెడుగులతో కూడిన నాట్యమని" ఒక కథ పిలిచింది. [38]"అయితే తగిన దినమొకటి వచ్చెను" మార్కు 6:21 అంటుంది. ఇది హేరోదియ పన్నిన పన్నాగం. తన కుమార్తె నాట్యం అ పన్నాగంలోని భాగమైయుంది. కామాతురతగల తన పెనిమిటిని హేరోదియ బాగుగా ఎరుగు. [39]ఈలాటి అపరిమితియైన కానుక తూర్పు దేశాల మాదిరియైయుంది (ఎస్తేరు 5:3, 6; 7:2లను చూడు). అయితే వారి కానుకను అవకాశంగా తీసికొన్న వారిపట్ల ఏలికలు దయచూపలేదు. [40]కోరుకోమనే అవకాశం ధనవంతుడు నీకు యిస్తే ఏమి కోరుకుంటావు? అనే దానికి శ్రోతలకు తెలిసే ఉదాహరణ చెప్పు.

[41]ఏమి అడగాలో హేరోదియ సలోమికి ముందుగానే చెప్పినట్టు మత్తయిలో గోచరిస్తున్నట్టుంది. సలోమి వెళ్లి తన తల్లిని అడిగివచ్చినట్టు సూచిస్తుంది (మార్కు 6:24). సరిగ్గా సంగతులు ఏ క్రమంలో జరిగాయో ప్రాముఖ్యం కాదు. అలా వారు నాటకం ఆడికూడా ఉండవచ్చు. [42]ద్రోహులకు యితరులలో ద్రోహమే కన్పిస్తుంది. [43]యేసు జన్మను గూర్చి విన్న తరువాత తన తండ్రియైన మహా హేరోదు ఎలాటి చర్యకు దిగాడో ఆలోచించు (మత్తయి 21:3, 13). [44]వారు కపెర్నహూమునకు తిరిగివచ్చి యుండవచ్చు. ఆయన పరిచర్యకు అది కేంద్రం. ప్రయాణాలు ముగిసే స్థలమది. [45]దీనిని మార్కు 3:20తో పోల్చి చూడు. [46]30వ సూచనను రివ్యూ చేయి. [47]మత్తయి వర్ణన యేసు ఏకాంతమునకు వెళ్లినట్టు (మత్తయి 14:13), క్రీస్తును ఆయన శిష్యులును ఏకాంతము అరణ్య ప్రదేశమునకు వెళ్లినట్టు (మార్కు 6:32) ఉండగా, లూకా రచన ఈ రెండు భావాలను యిలా కలుపుతుంది: "అపొస్తలులు తిరిగివచ్చి, తాము చేసినవన్నియు ఆయనకు తెలియజేయగా, ఆయన వారిని వెంటబెట్టుకొని బేత్సయిదా అను ఊరికి ఏకాంతముగా వెళ్లెను" (లూకా 9:10). [48]యేసు ఆయన శిష్యులతో "మంచి." "అధిక" సమయమును గడిపారు. [49]తూర్పుతీరానికి గత ప్రయాణం కొరకు మార్కు 4:35–5:21 చదువు. [50]దీనికి రుజువుగా, లుకా 9:10 చూడు. యేసును, ఆయన శిష్యులును బెత్సయిదాకు – సముద్రానికి తూర్పు దిశగా పయనించారు. అక్కడ వారు కొంతసేపు ఉన్న తరువాత, క్రీస్తు తన శిష్యులను తిరిగి బేత్సయిదాకు పంపారు (మార్కు 6:45).

[51]ఫిలిప్పు బేత్సయిదా వాడని ముందుగా మనం గమనించాం (యోహాను 1:44; 12:21). ఆ బేత్సయిదా "అంద్రెయ పేతురుల పట్టణమని" పిలువబడింది (యోహాను 1:44). ఇది యొర్దానుకు పశ్చిమమున కపెర్నహూమునకు సమీపముననున్న బేత్సయిదా కావచ్చు. [52]దేశ పటాన్ని చూడు.